
# లచ్చి ఓ లచ్చి!

★



(రచయిత)

రచన : శ్రీ పేరిచర్ల రామకృష్ణరాజు

"లచ్చీ!"

ఉలిక్కిపడి నిద్రలేచింది లచ్చి. ఎదురుగా తల్లి!

"మొద్దులా నిద్రపోతున్నావ్ వెలుగొచ్చేసింది!"

లచ్చి మాట్లాడలేదు. మౌనంగా పడుకున్న చాపముడిచి మూల పెట్టింది.

"ఇంకా ఇక్కడే తగలడ్డావ్! ఆలస్యమయితే పశువులు వెళ్ళిపోతాయి."

"మొఖం కడుక్కొని వెలతాను."

"నువ్వు మొహం కడుక్కొని వెళితే అక్కడ నీ కోసం సిద్ధంగా ఉంటుందా! ఎవరోవచ్చి తీసుకుపోతారు."

తల్లి కోపంగా మాట్లాడటంతో లచ్చి ఎదురు చెప్పలేక పోయింది. పెరట్లోవున్న బుట్టని తీసుకుని బయటకు వచ్చింది. రోడ్డుమీద దృష్టి మరల్చి చెఱువువద్దకు వెళ్ళింది.

చినచిన్న కెరటాలు వడ్డుకుచేరి చిరుసవ్వడిచేస్తున్నాయి. లచ్చికి ఆ శబ్దం ఎంతో యిష్టం!

అవతలి వడ్డునకొండ. సూర్యుడెప్పుడూ కొండ వెనుక నుంచే వస్తాడు.

అప్పుడప్పుడూ అనిపిస్తూ ఉంటుంది లచ్చికి. కొండ వెనక్కివెళ్ళి ఊరందరికంటే ముందు సూర్యున్ని చూసి రావాలని. తల్లి వళ్ళు ఓరేస్తుందని ఆ ప్రయత్నం ఎప్పుడూ చేయలేదు.

కొండ వెనుకనుంచి జాలరి ఎర్రటి వల విసిరినట్టుగా వుంది ఆకాశం.

చెరువు నీళ్ళుకూడా ఎర్రగా వున్నాయి.

లచ్చి తన ప్రతిబింబాన్ని ఎర్రటి నీళ్ళలో చూసుకుని మురిసిపోయింది.

కొండ వెనుకనుంచి నెమ్మదిగా పైకివచ్చాడు బాల బాస్కరుడు. ఎంత పెద్దదో మనస్సులో అనుకుంది లచ్చి.

ఉదయిస్తున్న సూర్యుణ్ణి చాలాసేపు చూస్తూ కూర్చుంది. లచ్చికి సూర్యోదయమన్నా, సూర్యాస్తమయమన్నా. పౌర్ణమి నాటి చంద్రోదయమన్నా ఎంతో యిష్టం. అలాగని ప్రకృతిని ఆరాధించేటంత వయసు, మనసు లేదు.

లచ్చిని చూస్తే తెలుస్తుంది వయసు ఎంతో...

గుండ్రటి ముఖం, పాలుచిలికించే బుగ్గలు, లేత పెదాలు చింపిరిజుట్టు, తామరతూడుల్లాంటి సన్నటి చేతులు, తప్పటడుగుల స్థాయినించి బయటపడ్డ పాదాలు, పొట్టిగాను బొందులు వ్రేలాడే డ్రాయరు...అరు ఏడు సంవత్సరాలకు మించి వయస్సు వుండదనిపిస్తుంది.

ఆశగా చూసే కళ్ళు, చక్రాల్లా తిరిగేకళ్ళు అన్వేషించే కళ్ళు, జీవంలేని కళ్ళు అందుకే ఆమెకళ్ళు లోతుకు పోయాయి,

ఆశ్చర్యం! నీళ్ళు త్రాగటానికి పశువులు వస్తున్నాయ్, పోతున్నాయ్! అప్పుడే పాలుత్రాగిన కోడెదూడలు చిందులు వేస్తున్నాయ్! లచ్చికూడా చిందులు వేయాల్సిన వయస్సే! కాని...వాటివంక ఆశగా చూస్తోంది.

ఏదో శబ్దం! అటు చూసింది.

With Best Compliments From :

THERE IS JOY

WHERE THERE IS

HIGH PRESSURE WATER SYSTEM




JOTHI

Engineering Works

INDUSTRIAL ESTATE,

MADURAI - 625 007

—ATHMAS

ఆశ్చర్యానికి అవధులులేవు!

కారణం...ఎత్తిన తోకను ముడుచుకుంటూ వెళ్ళిపోతున్న గేదె కనిపించటమే.

వేగంగా లచ్చి గేదెవేసిన పేడవద్దకు వెళ్ళింది.

చుట్టూ పరీక్షించింది. పేడ కడిని బుట్టలో వేసుకుంది. కాస్త దూరంలో మరో పేడకడి. మరికాస్త దూరంలో... బుట్ట నిండింది. సంతోషం పెరిగింది.

బరువుగావున్న బుట్టను ప్రయత్నంమీద బుజంమీదకు ఎత్తుకుంది.

సూర్యుడు చూస్తూండగానే బారపొద్దు ఎక్కాడు.

లచ్చికి ఆకలి పెరిగింది. భుజంమీద బరువు పెరిగింది. ఆయాసపడుతూ ఇంటికి చేరింది.

"నా తల్లే...నా తల్లే" అంటూ లచ్చి భుజంమీద బుట్టను దింపింది. బుట్టలోని పేడనుచూసి అబ్బురపడింది.

"తొందరగా మొహం కడుక్కో లచ్చి...వేడివేడిగంజి తాగుదువుగాని" పేడమీద దృష్టిని మరల్చకుండ అంది తల్లి.

లచ్చి పొయ్యిలోవున్న మసిబొగ్గుతో పళ్ళుతోముకుంది. బానలోవున్న నీళ్ళతో మొఖం కడుక్కుంది. మొఖం కడుక్కోవటంతో ఆకలి మరింత పెరిగింది. తొడుక్కున్న గౌనుతో మొఖం తుడుచుకుంది.

గంజివున్న గిన్నె అందించింది తల్లి.

'అమ్మా! బుట్ట బరువుగా వుంది' గంజి తాగుతు అంది లచ్చి.

'బుట్ట చిన్నదైతే ఎక్కువ పేడ పట్టదు.'

"బుజం నెప్పి పెడుతోంది.'

'రోజూ వుండేదేగా అదే తగ్గిపోతుంది. రాత్రి పడుకోబోయేముందు వేడినీటి కాపడం పెడతాను తగ్గిపోతుంది.

'అమ్మా! నేను రోజూ ఎక్కువ పేడ తెత్తాను. నా గంజితోపాటు బువ్వ పెట్టమ్మా!'

చివ్వున చూసింది లచ్చివంక. రవంతసేపు తల్లి మనః మూగగా రోదించింది. ఎవరో ప్రేవుల్ని ప్రేళ్ళతో కెలుతున్నట్లు అనిపించింది. కళ్ళలోకి నీళ్ళు వుబికాయి. లః తల ప్రేమగా నిమిరింది. నుదుటిమీద చిన్నగా ముద్దు కుంది.

ఆమెకు తెలుసు. ఆడుతూ...పాడుతూ వుండాల్సిన వయసులో బిడ్డచేత పని చేయిస్తున్నానని, అ ఆలు దిద్దించాల్సిన వయసులో పేడముద్దలు తీయిస్తున్నానని...

భర్త ప్రవర్తన సరియైనదైతే సంసారం హాయిగా వుండేది, బిడ్డ సుఖపడేది. కంటినుండి నీళ్ళు కారాయి. కొంగుతో తుడుచుకుంటూ అంది.

'రేపటినుంచి బుడమ బువ్వ పెడతాను.' బాధను దిగమ్రింగుతూ అంది.

'మా మంచి అమ్మ!' సంతోషంతో కేరింతలు కొట్టింది లచ్చి! అన్నంకోసం ఎంత తపిస్తుందో అప్పుడు తెలుసుకుంది తల్లి!

'ఆఁ లచ్చీ! ఎండిన పిడకలను అమ్మి తీసుకురా! నీకోసం ప్రతిరోజు బువ్వవండి పెడతాను.'

ఎండిన పిడకలను బుట్టలో వేసుకుని బుట్టను బుజం మీద పెట్టుకుని వెళ్ళింది.

లచ్చి వెళుతున్న వైపు చూస్తూ వుండిపోయింది తల్లి.

X X X

సూర్యుడు నెత్తిమీదకు వచ్చాడు.

రిక్షా తొక్కుతున్న రంగడు మండిపడుతున్నాడు. ఎండను మనస్సులో తిట్టుకుంటున్నాడు. మనసు చిరాకుగా వున్నా ఆనందంగా వున్నా సారా తాగడం అలవాటు.

నేరుగా ప్రభుత్వ సారాయి దుకాణంలోకి వెళ్ళాడు.

తూలుతూ బయటకు వచ్చాడు.

రిక్షాను రోడ్డుకు అడ్డదిడ్డంగా తొక్కుతూ ఇంటికి వచ్చాడు రంగడు.

'ఏమే! కూడు తీసుకురావే!'

'తాగొచ్చినోడు ఎవడూ కూడు తినడు' విసుక్కుంది భార్య.

'సంపేత్తాను...నీయమ్మ...పోయి కూడు తీసుకురా'

'పొద్దుటేకదా కూడు తిన్నావు. మూడుపూటలా కూడు కావాలంటే ఎలా వచ్చుద్ది. నీకుమాత్రం సుబ్బరంగా కూడు కావాలి. మాకు మాత్రం గంజినీళ్ళే గతి.'

'నోరెత్తావంటే సంపేత్తాను...నీయమ్మ...ఉన్న కాలు కూడాపోతే శనొదులుద్ది.'

'నా కాలు లేకపోవడంవల్లే కాల్చుకుతింటున్నావు.'

WITH BEST COMPLIMENTS FROM :




Phone : 24010
9, K. N. P. Colony,
Dharapuram Road,
TIRUPUR-638 608.

'సంపేత్తాను...నీయమ్మ...ఔసు లచ్చి ఏది! ఇంకా పిడకలు అమ్ముకురాలేదా!'

"లచ్చి సంపాదనను కూడా కొల్లగొట్టాలను చూస్తున్నావా! పసిది ఎంత కష్టపడుతుందో అర్థంచేసుకోవాలి. దానికెప్పుడైనా తిండి పెట్టగలిగేవా. నువ్వు తాగుబోతోడివి కాబట్టి, నేను కుంటిదాన్ని కాబట్టి మద్దన లచ్చి చస్తుంది" ఏడుస్తూ అంది.

'సంపేత్తాను...నీయమ్మ...ఇంటికొత్తే ఎప్పుడూ ఇదే ఏడుపు. ఎంతసేపు డబ్బు...డబ్బు...సుబ్బరంగా కూడు మానేసి సారా తాగితే హాయిగా వుంటుంది.'

"నీకు హాయిగానే వుంటుంది. మా కడుపులు మాడ్చుతున్నావు. ఆ పసిది గంజినీళ్ళు తాగలేక అన్నంకోసం ఎంత పరితపించి పోతోందో ఆలోచించావా...ధూ...' ఉమ్మి ఊస్తూ అంది.

'సంపేత్తాను నీయమ్మ! ఇక్కడికంటె అక్కడే నయం' మళ్ళీ రిషా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు రంగడు.

భర్త ప్రవర్తనకు ఏడుస్తూ కూర్చుంది.

X X X

గోధూళి వేళ...

లచ్చిమి పేడకోసం మళ్ళీ వేట ప్రారంభించింది.

అక్కడక్కడా పడివున్న పేడముద్దలను బుట్టలో వేస్తుంది. తన యీడు పిల్లలంతా ఆడుతున్నారు. పాడుతున్నారు, కేరింతలు కొడుతున్నారు. ఆకర్షణీయమయిన రంగుల్లో అందమైన బట్టలు.

ఆడుతున్న పిల్లలవంక ఆశగా చూసింది, లచ్చి కళ్ళు మెరిసాయి. బుజంమీద బరువుగా వుండటంతో పేడబుట్టను క్రిందకు దింపింది. తన గౌనువంక చూసుకుంది. మాసిపోయివుంది. అక్కడక్కడా చిరుగులు. తన గౌనుమీద తనకే అసహ్యమేసింది. ఉన్నది ఒకే గౌను. బాగా మాసిపోతే రాత్రులందు ఉతుక్కుని మరునాడు అదే గౌను తొడుక్కుంటుంది. గౌను వుతికిననాడు చలయినా, వర్షమయినా బొందుల లాగుతోనే వుంటుంది.

నీళ్ళు ఉబికాయి లచ్చిమి కళ్ళలోకి! వాళ్ళలా నవ్వుతూ, తుళ్ళుతూ, గెంతుతూ కేరింతలు కొడుతూ ఆడాలని, పాడాలని వుంది.

కాని...తనతో స్నేహం ఎవరు చేస్తారు.

దరిచేరితే "పేడలచ్చి" వచ్చిందని తరిమితరిమి కొడతారు. వాళ్ల సంతోషంతో కేరింతలు కొట్టడానికి, తను పేడ వేయడానికి గల వ్యత్యాసం ఎందుకు వచ్చిందో ఆ వయసుకు అర్థంకాదు.

'కథాంజలి' జన్మదిన సంచికకు మా శుభాకాంక్షలు !

NOVEL DIAMONDS
NOVEL DIAMOND WORKS

నోవెల్ వజ్రములు

నగలను అలంకరించుటకు
విశిష్టతకు ప్రసిద్ధి చెందినది.
అన్ని విధములైన కలర్ కమలములుగా
మా వద్ద దొరుకును.

మా వజ్రములకు గ్యారంటీ ఇవ్వబడును.

—: వివరములకు :—

Phone No. 2 7 4 6 8

NOVEL DIAMOND WORKS

7-A/2, North Sowrastra St. : : TIRUCHIRAPPALLI-620 008.

'వాళ్ళలా ఎందుకు ఆడలేకపోతున్నానూ' అని ప్రశ్నించుకుంటుంది అప్పుడప్పుడు.

జవాబుగా తల్లి అవిటితనం కనిపిస్తుంది. తండ్రి తాగుడు తెలుస్తుంది! అంతే...

ఆలోచనలనుండి తేరుకునేసరికి పిల్లలంతా వెళ్ళిపోయారు. బుట్టవంక చూసింది. భయం పుట్టింది.

బుట్టలో పేడలేదు. ఆపని ఎవరుచేసారో గ్రహించుకోగలిగింది.

సీతి... పేడ సీతి!

సీతి లచ్చి వయసుకంటె పెద్దది. అప్పుడప్పుడూ "ఫలానా వీధిలో వున్న పేడకడులన్నీ నావే" అంటుంది. ఎవ్వరూ ఆ వీధికి వెళ్ళరు. ఒకవేళ వెళితే సీతి అమ్మ వెళ్ళినవారి భరతం పడుతుంది. బండబూతులు తిడుతుంది. పేడ ఎక్కడా దొరకకపోతే లచ్చి లాంటివాళ్లు పోగుపెట్టిన పేడను దౌర్జన్యంగా ఎత్తుకుపోతుంది. ఎవరూ ఎదురు చెప్పటానికి వీలులేదు.

దూరంగా పేడకడి కనిపించింది.

దిగులుపోయి సంతోషం పుట్టింది లచ్చికి. బుట్టతీసుకుని దగ్గరకు వెళ్ళింది. సంతోషం మాయమయ్యింది. అంతలోనే సీతి దౌర్జన్యంగా ఆ కడినికూడా తీసుకుపోయింది.

నిరాశ నింపిన బుట్టతో...

బరువు గుండెతో...

భయం గుప్పెటతో... ఇంటికి చేరింది.

కాళీ బుట్టను చూచి తల్లి కోపంగా చూసింది.

లచ్చి ఏదో చెప్పాలని ప్రయత్నించింది.

కాని...

అప్పటికే లచ్చి వంటిమీద దెబ్బలు పడ్డాయి.

అదే ఆమె బలహీనత. ఎప్పుడూ బిడ్డ వంటిమీద చెయ్యి వేయకూడదనుకునేది, తనూ సంపాదించితే బిడ్డకు బరువు తగ్గేది. అవిటితనం బిడ్డకు బరువు పెంచింది. ఎప్పుడయినా కాళీబుట్టతో వస్తే క్షణికావేశం వస్తుంది. అనుకోకుండా లచ్చిని కొట్టేస్తుంది.

ఇప్పుడు లచ్చితోపాటు తల్లికూడా ఏడుస్తుంది. కూతుర్ని కొట్టినందుకు కాదు, రేపటికి బిడ్డకు తిండి ఉండదని. ఒక్కపూట లచ్చి పేడ తీసుకురాకపోతే మర్నాడు పస్తులుండాల్సిందే.

బపితావారి...
ప్రత్యేక తయారింపులు
• సీఫోర్ • చూస్త్రీ
• రాప్టూ • సెలెక్టిషన్
• దట్ సెలక్షన్.
Phone : 22909
BAPITA KNITTERS
Lakshmi Nagar, Tirupur-638 602

రంగడి సంపాదనమీద ఆశ ఎప్పుడో వదులుకుంది.

కాని...

రంగడు వీళ్ళ సంపాదనమీద ఆశ పెంచుకున్నాడు.

X X X

పేడకోసం వెళుతోంది లచ్చి.

చెఱువు వద్దకువచ్చి అవతలి వడ్డునవున్న కొండను చూసింది. కొండ వెనుకభాగం ఎర్రగా వుంది. ఉదయభాస్కరుడు కొండపైకి రాబోతున్నాడు. అందరి కంటి ముందు ఈరోజైనా సూర్యుణ్ని కొండ వెనుకకు వెళ్ళి చూడాలనుకుంది. అనుకోవటమే తరువాయి, వేగంగా కొండవద్దకు వెళ్ళింది. కొండను పరీక్షగా చూసింది.

ఆశ్చర్యం! అది మామూలు కొండ కాదు. పేడకొండ!

అబ్బ! "కొండంత పేడ" మనసులో అనుకుంది.

కొండను చూడగానే సూర్యుణ్ని చూడాలనే ఆశవదులుకుంది. కొండంత పేడను లచ్చి ఒక్కతె ఇంటికి తెచ్చేసింది. లచ్చి పేడను తీసుకువెళుతుంటే సీతి దౌర్జన్యం చేయబోయింది. ఎందుకో లచ్చి చేతిలో దారుణంగా ఓడిపోయింది. ఏడుస్తూ ఇంటికి వెళ్ళిపోయింది సీతి.

లచ్చి అంత ఎక్కువ పేడను తేవటం చూసి అవిటితల్లి ఆనందభాష్పాలు రాల్చింది. అప్పటినుండి తెల్లటిబువ్వ లచ్చికి పెట్టింది తల్లి. ఇంటినిండా పిడకలే! పిడకలు కొనుక్కోవడానికి జనం బారులు తీరారు. వస్తున్న జనాన్ని అదుపుచేయలేక చస్తున్నారు. వచ్చిన డబ్బును ఎక్కడ దాయాలో తెలీటంలేదు. డబ్బు వర్షంలా పడుతోంది.

తనకు నచ్చిన అందమయిన గౌన్లు కొనుక్కొంది లచ్చి. పూరిగుడిసె స్థానంలో మేడ వెలిసింది. లచ్చి స్నేహం కోసం పిల్లలంతా తహతహలాడిపోతున్నారు. అందమయిన బేగ్‌ని బుజానికి తగిలించుకుని చేతిలో వాటర్‌ఫ్లాస్క్ పట్టుకుని అందరి పిల్లలతో కాన్వెంటుకు వెళుతుంది లచ్చి.

లచ్చిని ఇప్పుడు అందరు లక్ష్మి అంటున్నారు. తండ్రి రంగడు మాత్రం రిక్షా తొక్కుతూనే వున్నాడు.

"చెళ్!"

కల చెదిరిపోయింది. కనులు తెరిచి చూసింది లచ్చి. ఎదురుగా నాన్న!

లచ్చికి నాన్నంటే భయం...ఎందుకంటే...

'లచ్చీ! ఇకనుంచి పిడకలు అమ్మిన డబ్బులు నా చేతికియ్యి అమ్మకు ఇవ్వమాక' కటువుగా అన్నాడు రంగడు.

'దొంగసచ్చినోడు ఆడిచేతికి ఇవ్వకు లచ్చి! తాగుడికి తగలేస్తాడు. మనకు ఈ గంజినీళ్ళుకూడా దొరకనివ్వడు' దూరంగావున్న అవిటితల్లి అంది.

'నేను అమ్మకే ఇత్తాను!'

'సంపేత్తాను నీయమ్మ...డబ్బు అమ్మకు ఇవ్వమాక!'

'ఉహూ! నేను అమ్మకే యిస్తాను!'


'నీయమ్మ...అమ్మకే యిత్తావుటే' లచ్చి పిర్రమీద అరచేత్తో కొట్టాడు.

'సచ్చినోడ సంటిదాన్ని అట్టా కాల్చుకుతింటావే! తాగుడికి రిక్షా డబ్బులు చాలటంలేదా! సంటిదాని సంపాదన డబ్బుకోసం సూత్తున్నావు ధూ...'

"డబ్బు ఎలా ఇవ్వదో సూత్తానే నీయమ్మ..." విసురుగా వెళ్ళిపోయాడు రంగడు.

అప్పుడు నెమ్మదిగా అంది తల్లి. 'లచ్చీ పిడకలు అమ్మి వచ్చేటప్పుడు నాన్న కంటపడకు. నీ దగ్గర డబ్బులు దొబ్బి

"కథాంజలి" జన్మదిన సంచికకు మా హృదయపూర్వకమైన శుభాకాంక్షలు !




సదరన్ ఇంజనీయరింగ్ ఇండస్ట్రియల్స్
1090, అవినాసిరోడ్డు, కోయంబత్తూరు - 641 037
ఫోన్: 32165, 22165
SP/SEI/7
వ్యాపార వివరములకు వ్రాయ కోరుచున్నాము

సారాకు తగలేస్తాడు.'

'అమ్మా! నాకు ఈయాల తెల్లటి బువ్వ పెట్టాల!'

'నీకోసం ఈరోజు తెల్లటి బువ్వ ఉడకేస్తాను. నువ్వు పిడకలు అమ్మి డబ్బు జాగ్రత్తగా తీసుకురా!'

బుట్టలోకి పిడకలు సర్దుకుని బుట్ట బుజంమీద పెట్టుకుని బయలుదేరింది లచ్చి.

లచ్చి దురదృష్టం కాబోలు! ఎవ్వరూ పిడకలు కొనలేదు. కాళ్ళీడ్చుకుంటూ బుజం నెప్పిపెడుతున్నా ఊరి చివరి వరకూ వెళ్ళింది. అదృష్టం ఫలించింది పిడకలన్నింటినీ ఒకింటి వారే కొన్నారు.

ఇప్పుడు లచ్చి చేతిలో రెండు రూపాయల నోటు ఫెళ ఫెళలాడుతుంది.

ఇంటికి బయలుదేరింది లచ్చి!

ఏదో శబ్దం నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చింది.

తలెత్తి చూసింది. ఎదురుగా రిక్షా శబ్దం!

రంగడు చేస్తున్న వికృత నృత్యం!

ప్రమాదం గ్రహించింది లచ్చి.

ప్రక్కనున్న సందులోకి పరుగుతీసింది.

రంగడు రిక్షాకు స్పీడు పెంచాడు.

సందుదాటి మరోవీధిలోకి వెళ్ళింది లచ్చి.

రంగడికి పట్టింపు పెరిగింది. కోపం పెరిగింది. రిక్షా వేగం పెరిగింది.

చిన్న గులకరాయిని లచ్చి కాలివేళ్ళు తాకాయి. బొక్కబోర్లా పడింది.

ప్రక్కనే రిక్షా ఆగింది.

సారావాసన ఘాటుగాతగిలింది.

లేవాలని ప్రయత్నించింది. రంగడే లచ్చి జబ్బపట్టుని లేవదీసాడు.


'పిడకలు అమ్మిన డబ్బుఇలా ఇచ్చేయి'

'ఇవ్వను. అమ్మకే ఇత్తాను' ఏడుస్తూ గుప్పెటబిగిస్తూ అంది.

'సంపేత్తాను...నీయమ్మ...మరియాదగా ఇచ్చేయి'

లచ్చికి తండ్రి మాటలు వినబడటంలేదు. తప్పించుకునే మార్గంకోసంచూస్తుంది.

'సంపేత్తాను నీయమ్మ...దిక్కులు చూసావంటే...




మర్యాదగా డబ్బియ్యి'

గుప్పెట మరింత గట్టిగా బిగించింది లచ్చి.

'నీయమ్మ...డబ్బడిగితే ఇవ్వవే' లచ్చి గుప్పెటను విడదీయటానికి ప్రయత్నిస్తున్నాడు.

తప్పించుకోవటానికి ఆలోచన దొరికింది.

వెంటనే...రంగడి చేతిని పళ్ళతో బలంగా కొరికింది.

'కెవ్'మంటూ గుప్పెట విడదీయాలనే ప్రయత్నంమానుకున్నాడు.

లచ్చి పరుగుతీసింది.

రంగడు వెంటపడ్డాడు, మండిపడ్డాడు.

లచ్చి మరింత వేగంగా పరుగుతీయాలనుకుంది.

రంగడు అప్పటికీ ఆమెజుట్టును బలంగా పట్టుకొన్నాడు

'నీ కివ్వను...నూ...నూ' ఏడుస్తూఅంది.

'నీయమ్మ...మర్యాదగా డబ్బియ్యి' కోపంగా అరిచాడు

గుప్పెట బిగించి 'నీ కివ్వను. అమ్మకిస్తాను' అంది.

రంగడుకి కోపం తారాస్థాయికి చేరుకుంది.

లచ్చి ఏడుపుకూడా తారాస్థాయికి చేరుకుంది.

'డబ్బిస్తావా...చంపమంటావా'

'ఇవ్వను'

లచ్చి చెంప'చెళ్' మంది

దవడ ఎముక 'ఫట్' మంది.

ఆమెచేతిలోని కాగితాన్ని బలంగా లాగాడు.

సగం చిరిగి వచ్చింది ఫెళ...ఫెళలాడుతూ రెండురూపాయలనోటు.